



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

పట్టం ఎవరికో...?



- నేడు ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు - టిడిపి అధిష్టానం నిర్ణయంపై ఆశావహుల ఎదురుచూపులు

సాగునీటి సంఘాల ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే రెండు దశల ఎన్నికలు పూర్తికాగా శనివారం ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అందుకు జలవనరుల శాఖ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, సాగునీటి వినియోగదారుల సంఘాలు టిడిపి కైవసం చేసుకోవడంతో ప్రాజెక్టు కమిటీలను కూడా టిడిపి వారే దక్కించుకోనున్నారు. అయితే ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా టిడిపి అధిష్టానం ఎవరికి అవకాశం కల్పిస్తుందోనని టిడిపి శ్రేణులు ఎదురుచూస్తున్నారు. టిడిపి అధిష్టానం నిర్ణయంపై ఆశావహులు ఆశలు పెట్టుకున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సాగునీటి సంఘాల ఎన్నికల్లో భాగంగా తొలి దశలో సాగునీటి వినియోగదారుల సంఘాలు (డబ్ల్యుయుఎ), డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు ఇప్పటికే పూర్తయ్యాయి. మూడో దశలో ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. కర్నూలు జిల్లాలో ఎల్ఎల్సి, గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో కెసి కెనాల్, ఎస్ఆర్బిసి, తెలుగు గంగ, శివ భాష్యం ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షుల సర్వసభ్య సమావేశాలు నిర్వహించి ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను ఎన్నుకోనున్నారు. ఎల్ఎల్సి కింద ఉన్న 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షుల్లో కనీసం ఐదుగురు హాజరైతే ప్రాజెక్టు కమిటీని ఎనుకోనున్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలో 12 డబ్ల్యుయుఎలు ఉండగా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ ఎన్నికకు కనీసం ఆరుగురు హాజరుకావాల్సి ఉంది. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, సాగునీటి వినియోగదారుల సంఘాలు టిడిపి కైవసం చేసుకోవడంతో ప్రాజెక్టు కమిటీలను కూడా టిడిపి వారే దక్కించుకోనున్నారు. అయితే ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా టిడిపి అధిష్టానం ఎవరికి అవకాశం కల్పిస్తుందోనని టిడిపి శ్రేణులు ఎదురుచూస్తున్నారు. టిడిపి అధిష్టానం నిర్ణయంపై ఆశావహులు ఆశలు పెట్టుకున్నారు. కర్నూలు జిల్లా పరిధిలోని ఎల్ఎల్సి, గాజులదిన్నె ప్రాజెక్ట్ కమిటీల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నికలో మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు ఎమ్మెల్యేలు, టిడిపి ఇంఛార్జిలు ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంది. ఎల్ఎల్సి పిసి ఛైర్మన్ పదవి కోసం హోళగుంద డిసి అధ్యక్షులు మిక్కిలినేని వెంకట శివ ప్రసాద్, కౌతాళం డిసి అధ్యక్షులు టిప్పు సుల్తాన్, పెద్దకడబూరు డిసి అధ్యక్షులు నరవ రమాకాంత్ రెడ్డి, ఎమ్మిగనూరు డిసి-6 అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, కర్నూలు డిసి-9 అధ్యక్షులు కె మహేశ్వర్ రెడ్డిలు పదవిని ఆశిస్తున్నారు. పోటీ అధికంగా ఉండటంతో ఛైర్మన్ అభ్యర్థి ఎంపిక బాధ్యతను పార్టీ అధిష్టానానికి వదిలేశారు. గాజులదిన్నె ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్‌గా కోడుమూరు డబ్ల్యుయుఎ-2 అధ్యక్షులు కెఇ మల్లికార్జున గౌడ్ పేరు దాదాపుగా ఖరారైనట్లు తెలుస్తోంది.

నంద్యాల జిల్లాలోని కెసి కెనాల్, ఎస్ఆర్బిసి, తెలుగు గంగ, శివ భాష్యం ప్రాజెక్టు కమిటీల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల పదవి కోసం ఆశావహులు భారీగా పోటీ పడుతున్నారు. కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడిగా బన్నూరు రామలింగ రెడ్డిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఎంపిక చేశారు. గురువారం అమరావతిలోని టిడిపి కార్యాలయంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ప్రతిపాదనకు ఉమ్మడి కర్నూలు, నంద్యాల, కడప జిల్లా ఎమ్మెల్యేలు ఆమోదం తెలిపారు. ఎస్ఆర్బిసి, తెలుగు గంగ, శివ భాష్యం ప్రాజెక్టు కమిటీల ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు టిడిపి అధిష్టానం ఇంకా నిర్ణయించాల్సి ఉంది.

పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల మరణాలు

- ఎన్‌హెచ్ 44 పిడి గైర్హాజర్‌పై కలెక్టర్ ఆగ్రహం
- రోడ్డు సేఫ్టీ సమావేశంలో ప్రమాదాలపై ఆరా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో మరణాల రేటు రోజురోజుకు పెరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలు నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఎన్ హెచ్ 44 ప్రాజెక్టు డైరెక్టర్ హాజరు కాకపోవడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆయనపై చర్యలకు ఉన్నతాధికారులకు డిఒ లెటర్ సిద్ధం చేయాలని ఆదేశించారు.కలెక్టర్ మాట్లాడుతూ .. నవంబరు నెలలో 57 ప్రమాదాలు జరుగగా అందులో 34 మంది చనిపోయారన్నారు. నందవరం మండలం, ధర్మాపురం గ్రామం వద్ద ఓవర్‌టేక్ వల్ల కార్, ఆటో ఢీకొనడం వల్ల ముగ్గురు చనిపోయారన్నారు. అదే రహదారిలో (ఎన్‌హెచ్-167) ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడం వల్ల ముగ్గురు చనిపోయారని, పోలీసు అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఆ ప్రాంతాన్ని పోలీస్, నేషనల్ హై వే అధికారులు పరిశీలించి వెంటనే ప్రమాదాల నివారణకు వీలుగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్వరితగతిన రోడ్ల మరమ్మతు పనులు పూర్తి చేయాలని, గుంతలను పూడ్చాలని ఆర్ అండ్‌బి ఎస్‌ఇని ఆదేశించారు. సంతోష్ నగర్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ సమీపంలో ఓపెనింగ్స్, రెయిలింగ్ ఎత్తు తక్కువగా ఉండడం వల్ల గత 15 రోజుల్లోనే ముగ్గురు చనిపోయారన్నారు. మూడున్నర ఫీట్ ఎత్తుతో రెయిలింగ్ వేయాల్సి ఉండగా కేవలం ఒకటిన్నర ఫీట్‌తో రెయిలింగ్ ఎందుకు వేశారని ఎన్‌హెచ్ 44 అధికారులను ప్రశ్నించారు. వెంటనే కొత్త రెయిలింగ్‌ను ఏర్పాటు చేయాలని, ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆలస్యం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఎల్లమ్మగుడి దగ్గర సైడ్ బ్రిడ్జి పనులు, అప్రోచ్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పెద్దపాడు నుండి హైదరాబాద్ ఎన్‌హెచ్‌కు లింక్ చేస్తూ రోడ్ ఏర్పాటుకు సర్వే చేసి తగిన ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. నంద్యాల, నందికొట్కూరు, కడప వైపు వెళ్లే బస్సుల్లో కొన్ని బస్సులను రాజ్ విహార్ సర్కిల్ డిపో నుండి తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, అదనపు ఎస్‌పి (అడ్మిన్) హుస్సేన్ పీరా, డిటిసి శాంతకుమారి, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, ఆర్అండ్‌బి ఎస్ఇ మహేశ్వరరెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఇ రామచంద్రారెడ్డి, ఆర్‌టిఒ లాల్ సింగ్ చౌహాన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందస్తు క్రిస్మస్ వేడుకలలో మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

30 ఎకరాల్లో హైకోర్టు బెంచ్

కలెక్టరేట్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలలో మంత్రి టిజి.భరత్ వెల్లడి

ప్రజాశక్తి కర్నూల్ కలెక్టరేట్

కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను 30 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నట్లు పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "క్రిస్మస్" పండుగ సందర్భంగా మైనార్టీ సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'హై-టి' కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి టిజి.భరత్ మాట్లాడుతూ రూ.14 వేల కోట్ల ప్రాజెక్టు కర్నూలు జిల్లా ఓర్వకల్లుకు తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టు రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. అంతకుముందు క్రైస్తవ మత పెద్దలు, సీనియర్ పాస్టర్లు క్రిస్మస్ కార్యక్రమానికి హాజరైన వారికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్యాండిల్ లైట్ సర్వీస్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి, పర్యాటక శాఖ డైరెక్టర్ ముంతాజ్, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్, సివిల్ సప్లయి డైరెక్టర్ లక్ష్మీనారాయణ, మైనారిటీ సంక్షేమ అధికారి సబీహా పర్వీన్, క్రైస్తవ మత పెద్దలు, సీనియర్ పాస్టర్లు, పాస్టర్లు, క్రైస్తవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో అరుదైన ఆపరేషన్

- విజయవంతంగా నిర్వహించిన డాక్టర్లకు సూపరింటెండెంట్, కెఎంసి ప్రిన్సిపల్ అభినందనలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా మానోపాడు మండలం ఉండవల్లికి చెందిన ఆకాష్ 19 సంవత్సరాల యువకుడు గత ఆరు నెలలుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ రక్తహీనతతో అనేక ప్రయివేట్ హాస్పిటల్లో చికిత్స పొందిన తగ్గక పోవడంతో కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఎస్-1 వార్డులో నాలుగు రోజుల క్రితం చేరారు. అతనికి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయగా అత్యంత ఆశ్చర్యకరంగా చిన్న పేగులోకి చిన్నపేగు వెళ్ళి, భోజనం కిందికి పోకుండా ఆపేదని టర్మినల్ ఇలియమ్ ముందు భాగంలో వున్న చిన్నపేగులోకి వెళ్లిందని దీనిని జనరల్ సర్జన్ విభాగం ప్రొఫెసర్, హెచ్ఒడి డాక్టర్ పి.హరిచరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు విజయ్‌బాబు, నరేష్, అబ్దుల్ అహ్మద్ ఆధ్వర్యంలో లోపలికి వెళ్లిన చిన్న పేగును మొత్తం బయటకు తీసి గడ్డకట్టి ఉన్న చిన్న పేగును తీసి మరల పేగును జత చేసి ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ప్రొఫెసర్ డాక్టర్ పి.హరిచరణ్ మాట్లాడుతూ వైద్య పరిభాషలో ఇలియా ఇలియాల్ ఇంటనషెప్షన్ అంటారని మామూలుగా చిన్న పేగులోకి పెద్ద పేగు వెళ్తుందని కానీ ఇతనికి చాలా అరుదుగా వచ్చే ఇంటనషెప్షన్ వచ్చిందని అన్నారు. ఇది చిన్నపిల్లలకు ఎక్కువగా వస్తుందని కానీ పెద్దవాళ్లకు రావడం చాలా అరుదు అని అన్నారు. అందులోను చాలా అరుదైన జబ్బు రావడంతో జనరల్ సర్జన్లు ఆశ్చర్యాన్ని వెలిబుచ్చారని అన్నారు. ఆపరేషన్ విజయ వంతంగా నిర్వహించామని తెలిపారు. గడ్డ కట్టిన పేగును వైద్య పరీక్షలకు పంపామని అన్నారు. ఈ ఆపరేషన్‌లో డాక్టర్ పి. హరిచరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు విజయ్‌బాబు, నరేష్, అబ్దుల్ అహ్మద్, పిజిలు డాక్టర్ హీరేష్ రెడ్డి , డాక్టర్ అనంతనాగ్, డాక్టర్ సంగీత, మొదటి సంవత్సరం పిజిలు , అనస్థీషియా వైద్యులు సీనియర్ రెసిడెంట్స్ డాక్టర్ బూన్, డాక్టర్ రాజ్ కిరణ్, డాక్టర్ కొండారెడ్డి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సంధ్య పిజిలు పాల్గొన్నారు. అత్యంత అరుదైన ఆపరేషన్ చేసినందుకు జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, జనరల్ సర్జన్ విభాగాధిపతికి ఎస్ -1విభాగం వైద్యులకు అభినందనలు తెలిపారు.



రోగికి విజయవంతంగా ఆపరేషన్ చేసిన వైద్య బృందం (ఇన్‌సెట్‌లో గడ్డ కట్టిన చిన్న పేగును తొలగిస్తున్న వైద్యులు)

ఓర్వకల్లులో రూ.14 వేల కోట్ల పెట్టుబడులు : మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

ఓర్వకల్లు పారిశ్రామికవాడకు రూ.14 వేలకోట్ల పెట్టుబడులు రానున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, శాఖ మంత్రి టిజి భరత్ చెప్పారు. సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్, ఇండియాకు చెందిన కంపెనీ సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు. ఈ మేరకు శుక్రవారం అమరావతిలో మంత్రులు నారా లోకేష్, టిజి.భరత్‌లతో కంపెనీ ప్రతినిధులు సమావేశమయ్యారు.

ఓర్వకల్లు పారిశ్రామిక వాడలో రూ. 14వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీ ప్రతినిధులు ముందుకొచ్చారని మంత్రి టిజి.భరత్ వెల్లడించారు. జనవరి రెండవ వారంలో సిఎం చంద్రబాబు సమక్షంలో కంపెనీతో ఎంఒయు చేసుకోనున్నట్లు పేర్కొన్నారు.



మంత్రులు నారా లోకేష్, టిజి భరత్‌లతో కంపెనీ ప్రతినిధులు

ప్రజల సహకారంతోనే గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తితో డిఎల్‌పిఒ వీరభద్రప్ప

ప్రజాశక్తి-పత్తికొండ



ప్రజలు సహకారంతోనే గ్రామాల అభివృద్ధి చెందుతాయని పత్తికొండ డిఎల్‌పిఒ వీరభద్రప్ప పేర్కొన్నారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో ముఖాముఖిగా మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం....

2024 -25 గానూ 15వ ఆర్థిక సంఘం నిధులు తొమ్మిది మండలాలలోని 155 గ్రామపంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 .90 కోట్లు పత్తికొండ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాలున్నాయి. పత్తికొండ, తుగ్గలి, మద్దికేర, దేవనకొండ, ఆస్పరి, ఆలూరు, క్రిష్ణగిరి, హాలహర్వి, చిప్పగిరి ఉన్నాయి. 155 గ్రామాలకు మా పరిధిలోకి వస్తాయి. 5,92,606మంది జనాభా జీవనం సాగిస్తున్నారు. ప్రతి గ్రామంలోని ప్రతి ఇల్లు కొలతల ద్వారా పన్ను, లైసెన్స్ ఫీజు, హోటల్, సెల్ టవర్లను గుర్తించి జియో ట్యాగ్‌చేస్తాం. 2025 సంవత్సరానికి రూ.నాలుగు కోట్ల పన్ను వసూలు చేయడం లక్ష్యం పెట్టుకున్నాం. గ్రామ ప్రజలు పంచాయతీ కార్యదర్శుల సహాయ సహకారాలు అందించాలని కోరారు. గ్రామాలలో జనాభాను బట్టి స్వచ్ఛభారత్ కార్మికులను గ్రామపంచాయతీ నియమించుకుంటుంది. 1000 జనాభాకు ఒకరు చొప్పున స్వచ్ఛభారత్ కార్మికుని నియమించుకుంటారు. డివిజన్ పరిధిలోని వాటర్ మెన్ దాదాపుగా 100 మంది ఉంటారు. గ్రామపంచాయతీ ఆదాయంలో 50 శాతం పారిశుధ్య కార్మికులకు, వాటర్ మెన్ లకు జీతాలు చెల్లిస్తారు.తొమ్మిది మండలాల్లోని 155 గ్రామాల గానూ 139 చెత్త సంపద కేంద్రాలు ఉన్నాయి. 16 చెత్త సంపద కేంద్రాలు వినియోగంలో లేవు. తొమ్మిది గ్రామాలలో చెత్త సంపద కేంద్రాలు పనులు జరుగుతున్నాయి. ఏడు గ్రామాలలో చెత్త సంపద కేంద్రాలను స్థలం వివాదంలో ఉన్నాయి. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చెత్త సంపద కేంద్రాలకు మరమ్మతులు కింద నిధులు మంజూరు చేస్తుంది. గ్రామపంచాయతీ ఆదాయం తోనే చెత్త సంపద కేంద్రాలు వినియోగంలో ఉంటాయి.

పొదుపు మహిళలు రుణాలను సక్రమంగా చెల్లించాలి

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలో పొదుపు గ్రూపుల ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని గ్రామీణ బ్యాంకు మేనేజర్ అమిత్ కుమార్ ఏరియా కో ఆర్డినేటర్ అబ్దుల్లా సమక్షంలో పేర్కొన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో ఎపిఎం రమేశ్వర్ అధ్యక్షతన పొదుపు గ్రూపుల, విబికెల సమీక్షా సమావేశం నిర్వహించారు. సిఐఎఫ్, శ్రీనిధి, వ్యక్తిగత రుణాలు, ఉన్నతి రుణాలు, ఉపాధి రుణాలనుఅందుకొని సకాలంలో చెల్లించి బ్యాంకు ఆదాయాలకు తోడ్పాటు నందించాలని పేర్కొన్నారు. గ్రూపుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి అవగాహన కల్పించాలని నూతన గ్రూపుల ఏర్పాటుకు శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. మండల మహిళా సమైక్య, గ్రామైక్య సంఘాల సభ్యులు పాల్గొన్నాయి.



కూటమి నాయకులు మాటపై నిలవాలి

- పిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కూటమి పార్టీ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి మాట నిలబెట్టుకోవాలని పట్టణ పౌరసంక్షేమ సంఘం (పిపిఎస్ఎస్) రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి అన్నారు. శుక్రవారం కర్నూలు మండలం బి తాండ్రపాడు పరిధిలోని చెరువు ఆక్రమణ ప్రదేశాన్ని పలువురు నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కర్నూలు చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములు, వాగులు, చెరువులు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన మాటపై నిలిచి సమగ్ర సర్వే చేసి ప్రభుత్వ భూములను, వాగులను, చెరువులను కబ్జాల నుండి కాపాడాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, న్యాయవాది చంద్రశేఖర్, ఎం నాగరాజు ,షేక్ అన్వర్‌బాష ప్రభుత్వాన్ని కోరారు. ఒపిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం ఆధ్వర్యంలో పలు కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు బి.తాండ్రపాడు చెరువు ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటిపారుదల శాఖ భూములను గుర్తించి కాపాడాలని కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూకబ్జాలపై స్పందిస్తున్నట్లుగానే కర్నూలు చుట్టూ జరిగిన భూకబ్జాలపై కూడా కూటమి ప్రభుత్వంలోని పాలకులు స్పదించాలని కోరారు. బి తాండ్రపాడు చెరువు, ప్రభుత్వ భూములు వాగులు మొత్తం కలిపి దాదాపు 100 ఎకరాల వరకు ఉన్నట్లు తెలిసిందని అన్నారు. ప్రభుత్వ భూములు చెరువుల కబ్జాల గురించి కొందరు అధికారులు వాస్తవాలను ప్రజలకు తెలియకుండా దాస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ భూములు, చెరువులు వాగులు కబ్జాలకు గురై పర్యావరణం దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. కబ్జాలను అరికట్టి రాబోయే తరానికి చెరువులు ప్రభుత్వ భూములు ఉపయోగపడేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో సభ్యులతో పాటు వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు కె.శ్రీనివాసులు, సివి వర్మ, ఎన్.మదిలేటి, ఎండి యూనుస్, ఎన్.పీటర్, బి.వన్నూరుసాహెబ్, బి.నాగేంద్ర, ఎన్.విజయ్ కుమార్, సి.మధు తదితరులు పాల్గొన్నారు.



బి.తాండ్రపాడు చెరువును పరిశీలిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

డిసిఎంఇ హరిబాబు ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు-1 డిపోను కర్నూలు డిప్యూటి చీఫ్ మెకానికల్ ఇంజినీరు హరిబాబు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. డిపో గ్యారేజీలోని బస్సుల పనితీరును పరిశీలించి మెకానిక్‌లతో మాట్లాడారు. బస్సుల సర్వీసుల వివరాలను డిపో మేనేజర్ సుధారాణి ఆయనకు వివరించారు. కర్నూలు డిప్యూటి చీఫ్ మెకానికల్ ఇంజినీరు హరిబాబు మాట్లాడుతూ బస్సుల కండిషన్‌లో చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా పెనునష్టం తప్పదన్నారు. బస్సుల మరమ్మతుల విషయమై సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. డిపో పరిధిలోని బస్సుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలో డిపో ఉద్యోగులు, మెకానిక్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంద్ర బస్సుల పని తీరును రోడ్ టెస్ట్ ద్వారా పరీక్షించారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

అవగాహన ర్యాలీలో నిర్వహించిన ఎస్‌పి బిందు మాధవ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ను ధరించాలని కర్నూలు జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ అన్నారు. శుక్రవారం హెల్మెట్ ధరిచాలని కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఎస్‌పి జి. బిందు మాధవ్ హెల్మెట్ ధరించి అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం నుండి ప్రారంభమై కంట్రోల్ రూమ్, కిడ్స్ వరల్డ్, రాజ్ విహార్, కలెక్టరేట్ మీదుగా సి.క్యాంపు సెంటర్ వరకు ర్యాలీ కొనసాగించింది. ఎస్‌పి మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకే కర్నూలు ట్రాఫిక్ పోలీసులతో అవగాహన ర్యాలీ చేపట్టామన్నారు. జాతీయ, రాష్ట్ర రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా ద్విచక్రవాహనదారులే మరణిస్తున్నారన్నారు. బైక్‌లు నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనచోదకులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం వల్ల అనుకోని రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుండు ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సురక్షితంగా గమ్యాలను చేరుకోవాలన్నారు. యువత అత్యుత్సాహంతో అతివేగంగా వాహనాలను డ్రైవింగ్ చేసి రోడ్డు ప్రమాదాల బారిన పడకూడదన్నారు. తల్లితండ్రులు తమ పిల్లలకు ట్రాఫిక్ రూల్స్ గురించి తెలియజేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకుండా ఉండేలా, మొబైల్ మాట్లాడుతూ డ్రైవ్ చేయకుండా, పరిమితికి మించి వెళ్ళకుండా పలు జాగ్రత్తలు చేపడితే దాదాపు రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. ఈ అవగాహన ర్యాలీ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ జి. హుస్సేన్ పీరా, కర్నూలు డిఎస్‌పి జె.బాబు ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్, ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్, కర్నూలు పట్టణ సిఐలు నాగరాజారావు, శేషయ్య, చంద్రబాబునాయుడు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐ లు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



హెల్మెట్ ప్రాధాన్యత అవగాహన ర్యాలీలో ఎస్‌పి బిందు మాధవ్

అమిత్‌షాను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలి

ఐలు కర్నూలు జిల్లా కమిటీ

ప్రజాశక్తి-కర్నూలు లీగల్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గురించి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ కర్నూలు జిల్లా కమిటీ(ఐలు) తీవ్రంగా ఖండిస్తున్నదని రాష్ట్ర అధ్యక్షులు కె.కుమార్, జిల్లా అధ్యక్షులు ఎస్.లక్ష్మణ్ భారత రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గురించి స్వాతంత్ర ఉద్యమంలో ఏ చరిత్ర లేని బిజెపి నాయకులు కేంద్ర మంత్రి అమిత్‌షా మాట్లాడడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. అణువణువునా మనువాద సిద్ధాంతాన్ని పునికి పుచ్చుకున్నా అహంకారంతో మదం ఎక్కి మాట్లాడుతున్నాడని, అలాంటి గొప్ప వ్యక్తి గురించి మాట్లాడటం చరిత్ర తెలియకపోవడమే నని అన్నారు. ఎటువంటి పోరాటాలు తెలియని వ్యక్తులు దేశ చరిత్ర తెలియని వ్యక్తులు అధికారంలో ఉంటే ఇలాంటి పనికిమాలిన వ్యాఖ్యలే వస్తాయని విమర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలను మేధావులు, విజ్ఞానవంతులు రాజకీయ నాయకులు, ప్రజలు అందరూ తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.



30 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం

ఎమ్మెల్యే కెఇ శ్యామ్ కుమార్

ప్రజాశక్తి- పత్తికొండ

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ ధ్యేయమని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యామ్ కుమార్ పేర్కొన్నారు. పత్తికొండ మండలం నలకదొడ్డి గ్రామంలో మాజీ సర్పంచి బత్తిని లోకనాథ్ ఆధ్వర్యంలో రూ.30 లక్షల అభివృద్ధి పనులు సిసి రోడ్డు , మిని గోకుల షెడ్లను ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను ఎడ్లబండపై పురవీధుల గుండా ఊరేగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా మరిచిందని అన్నారు. నలక దొడ్డి గ్రామానికి జిడిపి ద్వారా తాగునీరు, తాగునీరు అందిస్తానని గ్రామస్తులు భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ప్రజల కష్టాలను యువనాయకుడు నారాలోకేష్ అధ్యయనం చేశారని , అన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, తెలుగు యువత అధికార ప్రధాన కార్యదర్శి బత్తిని కుబేర్‌నాద్, బత్తిని రాజశేఖర్, టిడిపి నాయకులు వరప్రసాద్, చక్రాల ఎంపిటిసి రాజు, ఎంపిడిఒ స్వర్ణలత, ఎపిడి పకీరప్ప, ఎపిఒ వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రెటరీ పవన్ పాల్గొన్నారు.

ఈ భోజనం ఎలా తినాలి...?

- విద్యార్థులకు గుడ్డు, చిక్కి ఇవ్వని వంట నిర్వాహకులు
- హెచ్‌ఎంకు ఫిర్యాదు చేసిన విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టిక ఆహార భోజనం అందించేందుకు కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకాన్ని ప్రారంభించింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా జరుగుతోంది. పర్యవేక్షణ లోపం, అధికారులు పట్టించుకోక పోవడంతో, మధ్యాహ్న భోజనం నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఈ భోజనం ఎలా తినాలని ప్రశ్నిస్తున్నారు. హొళగుంద మండల పరిధిలోని గజ్జెహళ్లి గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు, మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 3 వ తరగతి నుండి 10 వతరగతి వరకు 653 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మధ్యాహ్న భోజనం మాత్రం 423 మంది విద్యార్థులు భోజనం చేస్తున్నారు. మిగిలిన విద్యార్థులు ఇళ్లకు వెళ్లి భోజనం చేస్తున్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు భోజనం సరిగా చేయకపోవడంతో ఇళ్లకు వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు చెబుతున్నారు. ఉడకని అన్నం, నీళ్ల చారు చేస్తున్నారని, ఆ భోజనం తింటే కడుపు నొప్పి వస్తున్నట్లు తెలిపారు. ఇళ్లకు వెళ్ళే విద్యార్థులకు గుడ్డు, చిక్కి ఇవ్వడం లేదన్నారు. ఈ విషయంపై హెచ్‌ఎం కేశవ్ కుమార్‌ను వివరణ కోరగా విద్యార్థులు భోజనం బాగాలేదని ఇళ్లకు వెళుతున్నారని, వంట నిర్వాహకులు వాళ్లకు చిక్కి, కోడి గుడ్లు ఇవ్వడం లేదన్నారు. వారితో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.


మధ్యాహ్న భోజనం బాగలేదని నిరసన తెలుపుతున్న చిన్నారులు

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి'-ఎమ్మిగనూరు : ఈనలె 29, 30 తేదీల్లో నిర్వహించే సిపిఎం 23వ కర్నూలు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. రామాంజనేయులు, సిపిఎం ఎమ్మిగనూరు మండల కార్యదర్శి పి. గోవిందు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హనుమంతు, సిఐటియు కార్యదర్శి రాముడు కోరారు. శుక్రవారం సిపిఎం జిల్లా మహాసభల సందర్భంగా ఎమ్మిగనూరులో బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 29న పట్టణంలో ర్యాలీ నిర్వహించి బహిరంగ సభ నిర్వహించామన్నారు. 29, 30వ తేదీలలో జిల్లాలో ఉండే ప్రతినిధుల సభ మాచాని సోమప్ప మెమోరియల్ హాలులో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభలు జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాయన్నారు. గత కార్యక్రమాలను సమీక్షించి భవిష్యత్తు పోరాటలకు, ప్రజా సమస్యలపై తీర్మానాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, రైతు సంఘం నాయకులు అబ్దుల్లా, కెవిపిఎస్ మండల కార్యదర్శి తిమ్మన్న, సిఐటియు నాయకులు రమేష్, దావీదు తదితరులు పాల్గొన్నారు.



సిపిఎం మహాసభ బ్యానర్లను ఆవిష్కరిస్తున్న రామాంజనేయులు, గోవిందు, తదితరులు

అన్న క్యాంటీన్‌ను కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలోని నిర్మల్ థియేటర్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ కృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. అక్కడ వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఎంతమందికి ఇస్తున్నారు, రసం, పప్పు, అన్నం నాణ్యతగా ఇస్తున్నారా అని అక్కడ ఉన్న వారిని ఆరా తీశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లలో మెనూ చార్ట్ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కమిషనర్ తెలిపారు. నిర్దేశించిన అందరికీ మంచి భోజనం అందించడం అన్న క్యాంటిన్ లక్ష్యమన్నారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు పట్టణంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో గురువారం రాత్రి ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఆలూరు యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆలూరు ఎమ్మెల్యే విరు పాక్షి, ముఖ్య ప్రసంగీకులు ఆదోని మహిమ చర్చ్ వ్యవస్థాపకులు రవి ప్రకాష్ హాజరయ్యారు. క్రైస్తవులు ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం పండుగ విశిష్టతను తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఆనంద్ రాజ్, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు మారెన్న పాల్, శ్యాం బాబు, ఉపాధ్యక్షులు బేనోహర్ బాబు, సహాయ కార్యదర్శి విజయ్ కుమార్, కోశాధికారి ఎసన్న, ఫాదర్ జ్ఞాన ప్రకాశ్, టిడిపి జిల్లా నాయకులు బెంగళూర్ కిషోర్, ఎంపీపీ రంగమ్మ తనయుడు వీరేష్, సంఘ పెద్దలు జాన్, రాజన్న, రాజశేఖర్, బాబు పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడికలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

జి.హోసల్లిలో వివక్షతను నిర్మూలించాలి

ప్రజాశక్తి-ఆదోని రూరల్

మండలం పరిధిలో జి.హోసల్లి గ్రామంలో ఎదుర్కొంటున్న వివక్షతను నిర్మలించాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కెవిపిఎస్ మండ కార్యదర్శి తిక్కప్ప, గ్రామ, అధ్యక్ష కార్యదర్శులు సురేష్, రమేష్, డివైఎఫ్ఐ నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ జి.హోసల్లి గ్రామంలో ఇప్పటికీ దళితులకు దేవాలయ ప్రవేశం లేక వివక్షను భరిస్తున్నారని, దీనికి తోడు గ్రామంలో జరిగే ఊరు దేవర సందర్భంగా పూజ నిర్వహణ క్రమంలో చూపుతున్న వివక్షను భరించలేకపోతున్నారని వాటిలో జోక్యం చేసుకొని వివక్ష నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారికి, డీఎస్పీ సోమన్న, డిప్యూటీ తహశీల్దార్ గుండ్ల నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు లక్ష్మన్న, రాఘవయ్య, వీరేశ్, మల్లికార్జున, చిన్న రాఘవయ్య, రాము పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న బిజెపి నాయకులు

- బలవంతంగా రేషన్ షాపులకు తాళాలు - షాపు వదిలి వెళ్లాలని డీలర్లకు హుకుం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుచరులు అంటూ కొందరు బిజెపి నాయకులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో నడిచే రేషన్ షాపులు, మధ్యాహ్న భోజనం నిర్వహణ, గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్లు, బుక్ కీపర్‌లుగా తమ వాళ్లే ఉండాలంటూ బిజెపి నాయకులు హుకుం జారీ చేస్తున్నారు. రాజీనామా చేయాలంటూ బలవంతం చేస్తూ తమ ప్రభుత్వం అధికారంలో ఉందంటూ తాము ఎమ్మెల్యే అనుచరులంటూ కొందరు రెచ్చిపోతున్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు మేలు చేస్తామని ఎవరికి ఇబ్బంది కలిగించమని ఎమ్మెల్యే పార్థసారథి పదేపదే చెబుతున్నా వాస్తవానికి మాత్రం భిన్నంగా ఉందంటూ పలువురు చెబుతున్నారు...


ఆదోని నియోజకవర్గంలో 116 రేషన్ దుకాణాలు ఉన్నాయి అందులో 35 మంది లైసన్ డీలర్లు ఉన్నారు ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తమను ఎవరు ఇబ్బంది పెట్టలేదని తప్పిదాలు జరిగితే అధికారులు చర్యలు తీసుకునేవారని చెబుతున్నారు. ఇటీవలనే ఆదోనిలో సుమారు 12 దుకాణాలకు బిజెపి నాయకులు తాళాలు వేసి స్వాధీనం చేసుకున్నారని డీలర్లు వాపోతున్నారు. ఎలాంటి తప్పిదాలు చేయకుండా సక్రమంగా పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్నామని చెబుతున్నారు. ఇదేమీ లేదని తమ ప్రభుత్వం అధికారంలో ఉందని తాళాలు ఇచ్చి వెళ్లాలని, లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బిజెపి నాయకులు భయపెడుతున్నారని తెలిపారు. ఈ పాస్ మిషన్ మెజర్మెంట్, కాటా, దుకాణం తాళాలు ఇచ్చి వెళ్లాలని దౌర్జన్యం చేస్తున్నట్లు డీలర్లు వాపోతున్నారు. కొందరి పైన అయితే భౌతికంగా దాడికి కూడా ప్రయత్నం చేశారని, స్థానికులు అడ్డుకోవడంతో పరారీ అయినట్లు తెలిపారు. దుకాణకు అనాధికారికంగా తాళాలు వేసి స్వాధీనం చేసుకున్నారని, ఇదెక్కడే పద్ధతి అంటూ ఆందోళన చెందుతున్నారు

అధికారులకు ఫిర్యాదు

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు రావాలంటూ బిజెపి నాయకులు ఫోన్ల ద్వారా బెదిరిస్తున్నారని డీలర్లు శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. దశాబ్ద కాలంగా డీలర్లుగా కొనసాగుతున్న తమను ఏ ప్రాతిపదికన వదులుకోవాలని చెబుతున్నారో స్పష్టత ఇవ్వాలని డీలర్లు కోరుతున్నారు. డీలర్లుగా కొనసాగే వారందరూ వైసిపి మద్దతుదారులు కాదని, విద్యార్హత కలిగి నోటిఫికేషన్ ద్వారా రాత పరీక్ష రాసి ఎంపికైన వారని, పార్టీలకతీతంగా నియామకం జరిగి కొనసాగుతున్నామని గ్రహించాలన్నారు.

ఎమ్మెల్యే మాట్లాడిన తీరు అభ్యంతరకరం

ఎమ్మెల్యేగా గెలుపొందిన మొదట్లో మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే పార్థసారథిని డీలర్లు కలిసిన సందర్భంలో డీలర్లను తొలగించే ప్రసక్తే లేదని, అవసరమైతే అసెంబ్లీలో మాట్లాడి మీ ఉద్యోగ భద్రతకు చట్టబద్ధత కల్పించే దిశగా కృషి చేస్తానని అనడంతో హర్షించామని డీలర్లు చెబుతున్నారు. ఈ నెల 18న జరిగిన కూటమి నాయకుల సమావేశంలో డీలర్లు అందరూ వదిలి వెళ్లాలని ఇంకెన్నాళ్లు కొనసాగుతారని బహిరంగంగా మాట్లాడారన్నారు ఆ మాటలతోనే కొందరు ఎమ్మెల్యే పేరు చెప్పి రెచ్చిపోతూ డీలర్ల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని వాపోతున్నారు. ఇక్కడ జరిగే దౌర్జన్యాలపై త్వరలోనే మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళతామని అంటున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా సంబంధిత అధికారులు నోరు మెదపడం లేదని తమ సమస్య ఎవరికి తెలపాలో తెలియని అయోమయంలో ఉన్నామని డీలర్లు వాపోతున్నారు. రాజకీయ కక్ష సాధింపులు మానుకొని సజావుగా ప్రజలకు సేవలు అందేలా ఎమ్మెల్యే చూడాలని కోరుతున్నారు.



ఖాళీ స్థలాలపై కన్ను

- జగనన్న కాలనీలో స్థలాల కబ్జాలతో జగడం
- టిడిపి, జనసేన వర్గీయుల నిర్వాకం
- దండోరా వేయించిన తహసీల్దార్

ప్రజాశక్తి - మంత్రాలయం

జగనన్న కాలనీలో పట్టాలు ఇచ్చి ఖాళీగా ఉన్న స్థలాలపై టిడిపి, జనసేన నాయకులు కన్నేశారు. కబ్జాకు తెరలేపి జగడాలకు ఆజ్యం పోశారు. ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు వీరేష్ రెవెన్యూ సదస్సులో భాగంగా గ్రామ సభలో గురువారం జగనన్న కాలనీలో కబ్జాలకు గురైన స్థలాలను ఖాళీ చేయించాలని తహసీల్దార్ రవికి ఇచ్చిన ఫిర్యాదుతో ఉదంతం వెలుగులోకి వచ్చింది. స్పందించిన తహసీల్దార్ జగనన్న కాలనీలో ఆక్రమణకు గురై టిడిపి పసుపు రంగులు వేసిన రాళ్లను తొలగింపజేశారు. శుక్రవారం ఉదయం దండోరా కూడా వేయించి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా స్థలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత వైసిపి ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు ఇళ్ళు స్థలాలు ఇచ్చి నిర్మించి ఇవ్వాలనే సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న కాలనీల పేరుతో ఇళ్ళు స్థలాలకు శ్రీ కారం చుట్టారు. మ్మిగనూరు జాతీయ రహదారి పక్కన దాదాపు 16 ఎకరాలను ప్రభుత్వం నుండి ఎకరా 25 లక్షల చొప్పున కొనుగోలు చేసి జగనన్న కాలనీలో దాదాపు 648 మందికి ఇళ్ళు స్థలాలు పంపిణీ చేశారు. అందులో మూల మూలల్లో మిగిలిన స్థలాల్లో స్థానిక కూటమి నాయకులు,అనుచరులు పోటాపోటీగా బండలు పాతడంతో పాటు పట్టాలు ఇచ్చిన స్థలాలను కూడా ఆక్రమించడం వల్ల రగడ మొదలైంది. కూటమి నాయకులు ఎవరు కూడా భూ కబ్జాలకు, అక్రమ ఇసుక రవాణాకు, పాల్పడవద్దని, బెల్టు షాపుల నిర్వహించ కూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరిస్తున్నా ఆయన మాటలు పెడచెవిన పెట్టి దందాలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థలాల కబ్జాపై వైసిపి, కూటమి నాయకుల మధ్య జరుగుతున్న వివాదం తహసీల్దార్ చర్యలతోనైనా సద్దుమణిగుతుందో లేదో వేచి చూడాలి.


స్థలాలను పరిశీలిస్తున్న తహశీల్దార్ రవి

ఇంటి పట్టాల సమస్యను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాలం మండలం ఎరిగేరి గ్రామంలో సర్వే నంబర్ 253లో ఇంటి పట్టాల సమస్యను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులో అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ వీరన్న మాట్లాడుతూ 18 సంవత్సరాలు క్రితం ఇంటి పట్టాలు ఇచ్చి లబ్ధిదారులకు స్థలాలు చూపలేదన్నారు. ఆ స్థలాన్ని కొంతమంది పెత్తందారులు ప్రైవేటుగా కొలతలు చేయించి ప్లాట్లు వేయడానికి ప్రయత్నం చేస్తే, గ్రామ ప్రజలు మొత్తం కర్నూల్ కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా చేయడం వల్ల అధికారులు స్పందించి తిరిగి 2023లో లేఅవుట్ కొత్తగా వేసి ఇంటి స్థలాలు చూపించారన్నారు. లబ్ధిదారులందరూ వారికి ఇచ్చిన స్థలాల్లో వేలాది రూపాయలు ఖర్చు చేసి గరుసు వేసుకున్నారని, ఈ మధ్యకాలంలో ఈ స్థలం కోర్టులో ఉందని, ఎవరు కూడా ఆ స్థలాలలోకి పోరాదని రెవెన్యూ అధికారులు నోటీసు బోర్డు వేయడంతో పేద ప్రజల ఆశలు అడియాశలు అయ్యాయన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. అధికారులు కాలయాపన చేస్తే ఆ స్థలాలలో సిపిఎంగా జెండాలు పాతి లబ్ధిదారులతో గుడిసెలు వేయిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు కే మల్లయ్య, నాయకులు ఈరన్న, కేశవ, వెంకటేష్ పాల్గొన్నారు.





ఉపాధి హామీ పనులను సమర్థవంతంగా నిర్వహించాలి

- ఎంపిడిఒ పుల్లయ్య

ప్రజాశక్తి-నందవరం

ఉపాధి హామీ పథకం పనులను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపిడిఒ పుల్లయ్య అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పుల్లయ్య, ఎపిఒ శ్రీనివాసులు, ఇసి నూర్జహాన్ పాల్గొన్నారు. ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకంలో 16 వందల మంది కూలీలు డైలీ వచ్చేలా చూడాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. మండలంలో మంజూరు అయిన మినీ గోకులం పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని చెప్పారు. ఉపాధి హామీ పనులపై ప్రజలకు అవగాహన కల్పించి ఉపాధి హామీ పథకం సమర్థవంతంగా నిర్వహించేలా చూడాలని తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు,మేటీలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో భూసమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి, హొళగుంద

రైతుల భూ సమస్యలు రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరిస్తున్నట్లు తాలూకా స్పెషల్ ఆఫీసర్ అజయ్ కుమార్, తహసీల్దార్ సతీష్ శుక్రవారం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సమ్మాతాగేరి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నిర్వహించిన రీ సర్వేలో భూ సమస్యలు తలెత్తడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రభుత్వం గుర్తించిందన్నారు. రైతుల సమస్యలను వారి గ్రామాల్లోనే అధికారుల సమక్షంలో పరిష్కరించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారి నరేంద్ర, సర్పంచ్ తనయుడు కమ్మి రెడ్డి, టీడీపీ నాయకుడు సీతయ్య, అటవీ శాఖ అధికారి, విఆర్ఒలు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల మెప్పు కోసం అధికారుల ఆరాటం

- రెవెన్యూ సదస్సుకు గ్రామ సర్పంచును పిలవరా..?

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

నియోజకవర్గంలో ముఖ్యమైన ప్రజాప్రతినిధి మెప్పు కోసం అధికారులు ఆరాట పడుతున్నారని నారాయణపురం గ్రామ సర్పంచ్ భర్త పురుషోత్తం రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండలం పరిధిలో నారాయణపురం గ్రామంలో నిర్వహించిన సదస్సుకు సర్పంచును పిలవకుండగా అవమానపరిచారని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామనిసర్పంచ్ అల్లమ్మ గారి సరళమ్మ, భర్త పురుషోత్తం రెడ్డి తెలిపారు. వైసిపికి చెందిన సర్పంచులపై వివక్ష చూపుతున్నారని అన్నారు.



ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన పాలకులు

సిపిఎం తుగ్గలి కన్వీనర్‌గా శ్రీరాములు ఎన్నిక

ప్రజాశక్తి-తుగ్గలి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి ప్రజల పైన అనేక రూపాలలో భారాలను మోపుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రామకృష్ణ విమర్శించారు. శుక్రవారం తుగ్గలిలోని సిపిఎం 3వ మండల మహాసభ రైతు సంఘం భవనంలో కొండారెడ్డి అధ్యక్షతన సిపిఎం తుగ్గిలి మండలం మూడవ మహాసభకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ , జిల్లా కమిటీ సభ్యుడు వీరశేఖర్ హాజరయ్యారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి ప్రజల పైన అనేక రూపాలలో భారాలను మోపుతున్నాయని అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ట్రూఆఫ్‌చార్జీలను వ్యతిరేకించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే అవలంబిస్తుందని విమర్శించారు. ఎన్నికలలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు కావాలని కూటం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యుడు వీరశేఖర్ మాట్లాడుతూ మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహించాలని కోరారు. పలు సమస్యలపైన తీర్మానాలు చేసి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం తుగ్గిలి మండల సిపిఎం మండల కన్వీనర్‌గా జి.శ్రీరాములును ఎన్నుకున్నారు. ఈ సభలో నూతన మండల కమిటీని ఐదుగురిని ఎన్నుకున్నారు. సిపిఎం మండల కమిటీ సభ్యులుగా శ్రీరాములు, బలరాముడు, వి.రామాంజనేయులు, ఎం రంగస్వామి, బెన్నీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సభకు కొండారెడ్డి, సుబ్బారెడ్డి, రంగరాజు, కె.శ్రీనివాసులు, ప్రతాప్, కోదండ, దేవదాసు, పొరుగు వెంకటేశు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి.రామకృష్ణ

యువకుని ప్రాణాలు కాపాడిన యశోద హాస్పిటల్స్ వైద్యులు

కన్సల్టెంట్ ఇంటర్నేషనల్ పలమనాలజీ డాక్టర్ విశ్వేశ్వరన్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలతో 21 ఏళ్ల యువకుడు సివిల్ ఇంజనీర్ నరసింహ పూనాలోని ఒక ప్రైవేట్ కంపెనీలో సివిల్ ఇంజనీర్‌గా చేరారు. రోడ్డు ప్రమాదంలో బహుళ ప్రధాన అవయవ తీవ్ర గాయాలతో ప్రమాదం నుంచి కోలుకోలేక హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్ లో చేరారు. ఇంటర్నేషనల్ పలమనాలజిస్ట్ డాక్టర్ విశ్వేశ్వరన్ మాటలలో....రోగి నరసింహ పూనా ,కర్నూల్ నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. పరిస్థితి క్షీణించడంతో, తదుపరి వైద్యం కోసం సోమాజిగూడలోని యశోద హాస్పిటల్స్‌కు తరలించారు. ఆయనకు కాలేయం, పిత్తాశయం, ప్లీహము, మూత్రపిండాలు, పక్కటెముకల పగుళ్లతో ఛాతీ గోడ, ఊపిరితిత్తుల గాయం , ఎడమ దిగువ అవయవ ఎముక పగుళ్లతో పొత్తికడుపులో గాయం ఉంది.కార్డియాక్ అరెస్ట్ తర్వాత రోగి పునరుజ్జీవింపబడ్డాడు. బహుళ క్రమశిక్షణా బృందంతో ఐసియులో చికిత్స అందించారు. రోగికి ఇన్ఫెక్షన్లు, చీము కారడం, ఫ్రాక్చర్ ఫిక్సేషన్ కోసం విస్తృతంగా చికిత్స అందించారు. చివరకు ఇంటి వాకింగ్‌కు డిశ్చార్జ్ చేశారు. డాక్టర్ లోకేశ్వర్ మాట్లాడుతూ నరసింహ సోమాజిగూడ యశోద ఆసుపత్రికి వారి తల్లిదండ్రులు తీసుకు వచ్చారు. అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి నరసింహ ఆరోగ్యాన్ని పరిరక్షించాం. ప్రస్తుతం అతను ఇంటి వద్ద వాకింగ్ చేయగలుగుతున్నారు. నరసింహ తండ్రి రామచంద్ర ఆచార్య మాట్లాడుతూ తన కుమారుడు పూనాలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడన్నారను. వెంటనే స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేయించి కర్నూలు ఓమ్ని హాస్పిటల్‌లో చేర్పించాం. సుమారు రూ.పది లక్షలు ఖర్చు అయిన ఆరోగ్యం మెరుగుపడలేదన్నారు. క్రిటికల్ పొజిషన్ లోకి ఆరోగ్యం మారడంతో వైద్యుల సలహాతో సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో చేర్పించామన్నారు. అక్కడ సుమారు 20 రోజుల పాటు వైద్యులు వైద్య చికిత్స అందించి ఆరోగ్యాన్ని మెరుగుపరిచి నా కుమారుని ప్రాణాలు కాపాడారు. కంపెనీ బీమా సౌకర్యం కల్పించడంతో సుమారు రూ.30 లక్షలు ఖర్చు అయినా నాకుమారుని ఆరోగ్యం కుదుటపడడంతో సంతోషంగా ఉంది. కంపెనీ యాజమాన్యానికి యశోద ఆసుపత్రి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ విశ్వేశ్వరన్

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పత్తికొండ

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కరెంటు ఛార్జీలను తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పత్తికొండ పట్టణంలో సిపిఎం నాయకులు, ప్రజలు కలిసి కరెంటు బిల్లులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే కరెంటు చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందన్నారు. కొండగేరి కాలనీలో తాగునీరు సక్రమంగా సరఫరా చేయడం లేదని తెలిపారు. రానున్న రోజుల్లో సమస్యలపై సిపిఎంగా ప్రత్యేక దృష్టి పెట్టి పోరాటాలకు శ్రీకారం చుడతా మన్నారు. పాలకులు సంపన్నుల ప్రయోజనా లకోసం కాకుండా సామాన్యుల ప్రయోజనాల కోసం పని చేయాలన్నారు. మండల కమిటీ సభ్యుడు గోపాల్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పాస్ పోర్ట్ పోయినది

కర్నూలు నగరం 4వ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముంటున్న సిద్ధచంద్రరెడ్డి కి చెందిన పాస్ పోర్ట్ రంగులు వేయడానికి ఇంటని శుభ్రపరుస్తుండగా పోయినది. (పాస్ పోర్ట్ నెం-ఇ6947181) పోలీస్ స్టేషన్ లో సైతం పిర్యాదు చేయడం జరిగింది. ఎవరికైన కనిపించిన యెడల.

ఈ ఫోన్ నెం- 9951616785ను సంప్రదించగలరు

మహారాజ శ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఓ.ఎస్. నెంబర్ 682/24

కె.కృష్ణయ్య. ...వాది

వర్సెస్

ఎం.ప్రమీల. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్సు

ఎం.ప్రమీల భర్త బ్రహ్మయ్య,
ఇంటి నెంబర్ 1345-1 డబ్ల్యూ నగర్,
ఇంజనీర్స్ కాలనీ, నంద్యాల చెక్ పోస్ట్ కల్లూరు,
కర్నూల్ సిటి.

పై నెంబర్ దావాలో వాది ప్రతివాది నుండి దావా మొత్తము రూపాయలు 9,35,907-00 ముందు వడ్డీ కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాదైన నీకు ఆక్షేపణ ఉన్న 03.01.2025 తేదీన పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను లేనియెడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

ఎన్.వెంకటరావు,
ఎం.జయప్రకాష్ రావు,
వాదిపరం అడ్వకేట్లు,
కర్నూలు

కంప్లైంట్ ఆఫ్ లాస్ట్ డాకామెంట్స్

తేది: 14-12-2024
గౌరవనీయులైన ఎమ్మిగనూర్ టౌన్ C.I. గారికి
ఎమ్మిగనూరు టౌన్, UPS,
కర్నూలు జిల్లా.
అయ్యా !
మేము 1) ఎమ్మిగమారు అయ్యన్న గౌడ్, 2) వై.మల్లన్న గౌడ్, మిలటరి కాలనీ, ఎమ్మిగనూరు టౌన్ నివాసిసులము, మేము డాక్మెంట్ నెం: 9930/2023 అనే 14 సెంట్లు విస్తర్ణమును ఉన్న ప్లాటు ఆదోని మండిగిరి పంచాయితిలో ఉన్నది, తేది:14-12-2024న సదరు డాక్మంట్ యొక్క లింక్ డాక్ మెంట్ నెం: 1181/2020 అనే ఒరిజినల్ లింక్ డాక్యెమెంటు జిరాక్స్ కాపీ కొరకు కవర్ లో పెట్టుకొని బైక్పై వైయస్ఆర్ సర్కిల్ దగ్గర గల జిరాక్స్ సెంటర్కు వెలుతున్నాము అయితే సదరు జిరాక్స్ సెంటర్ వెల్లగా బైక్ వెనుక పెట్టుకున్న డాజ్మెంట్ కవర్ కనిపించలేదు తీరా వెనుకకు వెల్లి వెతికినాము అయిన డాక్స్ మెంట్ గల కవర్ కనిపించలేదు, కనుక దయతో తమరు నా యొక్క డాక్మెంట్ను వెతికి ఇవ్వవలసిందిగా కోరుచున్నాము.

ఇట్లు తమ వీధేయులు
1) Y. Ayyanna Goud
PHNO: 7382391903

మహారాజ శ్రీ కర్నూలు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఐ.ఎ. నెంబర్ 320/2024
ఓ.ఎస్. నెంబర్ 682 / 2024

కె. కృష్ణయ్య. ...వాది/అర్జీదారు

వర్సెస్

ఎం.ప్రమీల భర్త ఎం.బ్రహ్మయ్య,
ఇంటి నెంబర్ 87/1345-1, డబ్ల్యూ నగర్,
ఇంజనీర్స్ కాలనీ, నంద్యాల చెక్‌పోస్టు, కల్లూరు,
కర్నూల్ సిటి. ...ప్రతివాది/ రెస్పాండెంట్

పై నెంబర్ దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తము వగైరాలు రాగోరి దావా దాఖలు చేస్తూ దావా మొత్తమునకు పూచిగా షెడ్యూలు దాఖల ఆస్తిని ఆల్‌జప్తు కోరి పై అర్జి దాఖలు చేసినాడు. ఇందులో రెస్పాండెంట్ అయిన నీకు ఆక్షేపణలు ఉన్న 03.01.2025 తేదీన పగలు 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపకొనవలయును. లేనియెడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

షెడ్యూలు

The House situated within the registration and sub registration District of Kurnool and Within the Engineering cooperative colony bearing plot number 35 Southeren side half, approve with L.P. No. 371/1984

Boundaries:
East : Plot No. 36
West : 33 Wide road
North : Remaining Half Plot No.35
South : 33 Wide road

Measurements:
1230 square feet or 136.66 square yard
M.V of Rate 1,99,523/-

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

ఎన్.వెంకటరావు,
ఎం.జయప్రకాష్ రావు,
వాది అర్జీదారుపరం అడ్వకేట్లు, కర్నూలు